నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గండి హనుమాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మలైమెట్, మహబూబ్‌కాలనీ, నట్రాజ్‌నగర్, ఐస్ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పంజేషా విద్యుత్ ఫీడర్ పరిధిలో..

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పంజేషా విద్యుత్ ఫీడర్ పరిధి లోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. పంచమహల్లా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే బీబీ బజార్, అస్రా హాస్పిటల్ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సాయిబాబా ఆలయంలో సత్సంగ్ ప్రవచనాలు


వేడుకల్లో ఆలయ అధ్యక్షుడు కట్టా నాగేందర్

అబిడ్స్: వెల్ఫేర్ అసోసియేషన్ సాయిబాబా ఆలయ కమిటీ, అనుమత్ కాశీవరప్రసాద్ ట్రస్ట్‌ల సంయుక్తంగా గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో సత్సంగ్ ప్రవచనాలు ఆధ్యాత్మిక భావాలతో కొనసాగాయి. కాశీ వన ఆశ్రమ పీఠాధిపతులు యోగిని, చంద్రకాళీ ప్రసాద శిష్యులు ప్రవచన కర్త శ్రీనివాస రామానుజదాస్ ప్రవచనాలు బోధించారు. ఆలయ అధ్యక్షుడు కట్ట నాగేందర్ వారిని ఘనంగా సత్కారం చేశారు. ఆదివారంతో ఈ ప్రవచనాలు ముగిశాయి.

అభినందనలు



క్రీడాకారులతో కోచ్‌లు ప్రణీత్, చైతన్య

గన్‌ఫౌండ్రీ: మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న యూటీటీ 86వ ఇంటర్ స్టేట్ సబ్ జూనియర్స్, క్యాడెట్ నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగర క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. టోర్నమెంట్‌లో మొదటి నుంచి రాణించిన అనియా ఆనంద్ సుశ్రుత, సాన్వీ సెమీ ఫైనల్‌లోకి చేరుకొని ఉత్కంఠ పోరులో ఓడిపోయారు. ఈ సందర్భంగా వారిని కోచ్‌లు ఎస్.ప్రణీత్, ఎం.చైతన్యాలు వారిని అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉచితంగా న్యాయ సలహాలు, సేవలు

చార్మినార్: యాకుత్‌పురాకు చెందిన షహీర్ అహ్మద్ షాహిద్ లండన్‌లోని కింగ్‌స్టన్ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పొందిన సందర్భంగా ఆదివారం పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఆయనను కలిసి అభినందించారు. నిజాం కాలం నుంచి ఆయన తాత, తండ్రి యునాని వైద్యంతో స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తూ పలువురి ప్రశంసలు పొందుతుండగా.. షహీర్ అహ్మద్ షాహిద్ న్యాయ శాస్త్రంలో పట్టా పొందిన తాను ఉచితంగా న్యాయ సలహాలు, సేవలు అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

ఉత్సాహంగా వెల్ బేబీ షో



అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్ సొసైటీ యశోదా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం చిన్నారులకు వెల్ బేబీ షో చేపట్టారు. విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి యశోదా ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డి.లింగయ్య హాజరై చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు నిరంజన్ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఎంసీ సభ్యులు డాక్టర్ మహ్మద్ మకన్, డాక్టర్ జీవన్, అడ్వైజర్ డాక్టర్ జీఎస్ శ్రీనివాస్, కన్వీనర్ డాక్టర్ సంజీవ్‌కుమార్, జాయింట్ కన్వీనర్ డాక్టర్ మల్లేశ్వరీ, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు

- అమృత్ భారత్‌లో భాగంగా రూ.26.80 కోట్లు మంజూరు
- ఇకపై సిటీ సెంటర్‌గా మారనున్న స్టేషన్


కొనసాగుతున్న టెర్మినల్ నిర్మాణ పనులు


నిర్మాణ తుది దశలో వెయిటింగ్ హాళ్లు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ముఖచిత్రం త్వరలోనే మారనుంది. సమస్యల కూతతో సతమతమవుతున్న ఈ స్టేషన్‌ను కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా రూ.26.80 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా ఆధునీకరిస్తుంది. 2023 ఆగస్టు 6న ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభమైన ఈ ఆధునీకరణ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. మరి కొన్నాళ్లల్లో ఈ పనులు పూర్తయితే ఆహ్లాదకరంతో కూడిన స్వచ్ఛ వాతావరణం ప్రయాణికులకు ఎంతో ప్రశాంతతను చేకూర్చనుంది.

మొదటి దశలోనే..

అమృత్ భారత్ స్టేషన్లలో భాగంగా ఆధునీకరణకు 39 రైల్వే స్టేషన్లను ప్రకటించగా.. అందులో తొలి దశలోనే 21 స్టేషన్లతో పాటే ఉప్పుగూడ రైల్వేస్టేషన్ కూడా చోటు దక్కించుకుంది. అంతర్జాతీయ స్థాయి హంగులతో టెర్మినల్, రూఫ్ ప్లాజా, ఎస్కలేటర్, లిఫ్ట్, ఉచిత వైఫై సదుపాయం, ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లు, టికెట్ బుకింగ్ గదులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, వన్ నేషన్-వన్ ఫుడ్ దుకాణాలు, ప్లాట్ ఫారంపై నూతన గ్రానైట్ బండలు, ప్రహరీ నిర్మాణం, తాగునీటి సింక్‌లు, మూత్రశాలలు, స్టేషన్ ఆవరణలో పచ్చదనం కోసం గార్డెన్, వాహనాల పార్కింగ్, రైళ్ల రాకపోకలు అనౌన్స్‌మెంట్ సిస్టం.. ఇలా ప్రయాణికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం టెర్మినల్ వర్క్ కొనసాగుతుంది. వెయిటింగ్ హాళ్ల నిర్మాణం సైతం ఇప్పటికే పూర్తయ్యింది. ప్లాట్ ఫారంపై బండల పనులు పనులు సైతం ఊపందుకున్నాయి. ప్లాట్ ఫారంపై నుంచి నీరు వెళ్లేందుకు కూడా ప్రత్యేక మార్గాలు సిద్ధం చేస్తున్నారు.

నగర చారిత్రక, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా..

నగర చారిత్రక, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌ను సిటీ సెంటర్‌గా తీర్చిదిద్దుతుండడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సకల హంగులతో ఈ స్టేషన్ ఆధునీకరణకు నోచుకుంటుండడంతో పరిసర ప్రాంతాలు సైతం వాణిజ్య పరంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఈ స్టేషన్‌కు ఇరువైపులా వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే వంతెనలను సైతం నిర్మించారు. ఛత్రినాక నుంచి ఉప్పుగూడ వైపునకు రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ), ఛత్రినాక నుంచి కందికల్ గేట్‌కు వెళ్లే రూట్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)లు నిర్మించబడ్డాయి. రైల్వే గేట్ల వద్ద రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఈ వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

రైలు నిండాలన్నా.. ఖాళీ కావాలన్నా..

పాతబస్తీలో ఉప్పుగూడతో పాటు ఫలక్‌నుమా, యాకుత్‌పురా, డబీర్‌పురా రైల్వే స్టేషన్లు ఉన్నప్పటికీ రైల్వే శాఖకు అధిక ఆదాయం ఇచ్చే స్టేషన్‌గా ఉప్పుగూడనే ముందు వరుసలో నిలుస్తుంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ స్టేషన్ మీదుగా వెళ్లే ఎంఎంటీఎస్ రైళ్లలో ఏ రైలు ప్రయాణికులతో నిండిపోవాలన్నా..పూర్తిగా ఖాళీగా కావాలన్నా ఈ స్టేషన్‌లోనే ఆ దృశ్యం కనిపిస్తుంది. ఉదయం పూట 7 నుంచి 10 గంటల వరకు ఏ రైలు చూసినా కళాశాల విద్యార్థులతో కళకళలాడుతూ కనిపిస్తుంది.

ఎంతో మందికి జీవనోపాధి..



ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేయడం హర్షణీయం. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రైల్వే శాఖకు ఆదాయం కల్పిస్తున్న ఈ స్టేషన్‌ను రూ.26.80 కోట్లతో అభివృద్ధి చేయడం సముచితంగా న్యాయం చేసినట్లవుతుంది. పాతబస్తీలోని రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించేందుకు నరేంద్ర మోదీ సర్కార్ నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆధునీకరణతో ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక ప్రజల్లో ఎంతో మందికి జీవనోపాధి లభించనుంది.

– తాడెం శ్రీనివాసారావు, ఉప్పుగూడ

కళాకారులు సమాజంలో చైతన్యం తీసుకురావాలి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రజా కళాకారులు తమ కళలతో సమాజంలో చైతన్యం తీసుకురావాలని సినీ నటుడు మాదాల రవి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ఆధ్వర్యంలో కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సాంఘీక పౌరాణిక నాటకాలకు ప్రోత్సాహం లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజానికి నష్టం కలిగించే సినిమాలు వస్తున్నాయని వాటిని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై కళాకారులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సంస్థ ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, వీరయ్య పాల్గొన్నారు.

'పేద, మధ్య తరగతికి అనుకూలమైన బడ్జెట్'


వెన్న ఈశ్వరప్ప

అబిడ్స్: పేద, మధ్యతరగతి, రైతులు, చిరు వ్యాపారుల, యువ పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అన్నారు. ఆదివారం అబిడ్స్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. మధ్య తరగతి ఉద్యోగుల, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఓ వరం అన్నారు. ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక చర్య అన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం ఇతర అనుకూలమైన బడ్జెట్ ఎన్నడూ రాలేదన్నారు. ఇది సంస్కరణల బడ్జెట్ అని, 2027 నాటికి భారత్‌ను మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగానే ఈ బడ్జెట్‌ను రూపొందించడం గొప్ప విషయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఇంత గొప్ప బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్వరూప యాదవ్‌కు సన్మానం

అబిడ్స్: రాజ్‌భవన్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన బి.స్వరూప యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. 1988 నుంచి రాజ్‌భవన్‌లోని గవర్నర్ హౌజ్‌లో ఆయాగా పనిచేసిన స్వరూపయాదవ్‌ను రాజ్‌భవన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సుధామ, జాయింట్ సెక్రెటరి భవాని శంకర్, డిప్యూటీ సెక్రెటరి పల్లవీ సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్వరూపయాదవ్ మాట్లాడుతూ..36 ఏళ్ల పాటు అందరి సహకారంతో విజయవంతంగా 7 మంది గవర్నర్ల హయాంలో ఆయాగా పనిచేయడం ఎంతో తృప్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు హెరాల్డ్ డేవిడ్, దీపక్ భరత్ తదితరులు పాల్గొన్నారు.


స్వరూప యాదవ్‌ను సన్మానిస్తున్న సుధామ, భవానీశంకర్

నోటు పుస్తకాల పంపిణీ



నాంపల్లి: వసంత పంచమిని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ నేత మురళీ మోహన్ సింగ్ పేద పిల్లలకు ఆదివారం హనుమాన్ ఆలయంలో నోటు పుస్తకాలు, పెన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని బల్వీర్ భక్త సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిఏటా సరస్వతీ పూజను చేపట్టి నిరుపేద పిల్లలకు పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి సరస్వతి పూజలు

చార్మినార్: వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో బెంగాలీలు మూడు రోజుల పాటు సరస్వతి పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 3, 4, 5 తేదీలలో ఈ పూజలు జరగనున్నట్లు ఆలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. పూజల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారన్నారు. బెంగాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పూజల్లో స్థానిక భక్తులతో పాటు నగరంలోని బెంగాలీలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకొనున్నారన్నారు. 5న అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా హుస్సేన్‌సాగర్‌కు తరలించి నిమజ్జనం చేయనున్నారన్నారు.

ముగిసిన రెజ్లింగ్ పోటీలు



విజేతతో దేవర వంశీ తదితరులు

గోల్కొండ: నరేంద్రమోదీ సారథ్యంలో క్రీడలకు ముఖ్యంగా యువ క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం లభిస్తుందని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శివ మార్కండేయ కేసరి 3వ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. గుడిమల్కాపూర్‌లో జరిగిన ఈ పోటీల్లో డిఫెండింగ్ చాంపియన్ చందన్‌సింగ్ పహిల్వాన్ మరోమారు విజేతగా నిలిచారు. నిర్వాహకులతో కలిసి దేవర వంశీ విజేతకు గధతో పాటు శివ మార్కండేయ కేసరి కిరీటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హిందూ యువసేన అధ్యక్షుడు ఉత్తరపల్లి దయానంద్, కరీంనగర్ ఎమ్మెల్సీ ఎల్.రమణ, అరవింద్‌కుమార్‌గౌడ్, కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉత్తరపల్లి కృష్ణ, రాధాకృష్ణ, కట్ట భరత్‌కుమార్ తదితరులున్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకీలోని తన కార్యాలయంలో ఆయన మజ్లిస్ కార్పొరేటర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్పొరేటర్లు, కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రానున్న వేసవిలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమైన చోట కొత్తవి వేసి లీకేజీల ద్వారా నీరు వృథా కాకుండా చూడాలని ఆయన అన్నారు. మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమతమ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు దరఖాస్తులు చేసుకున్న వారిని కలిసి వారికి సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్, హబీబ్ చౌస్ తదితరులున్నారు.

సోనియా గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

చాంద్రాయణగుట్ట: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియా గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆదివాసీ గిరిజన సమాజాన్ని అవమానించినట్లేనని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ మండిపడ్డారు. వెంటనే ఆమె బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి గిరిజన ఆదివాసీ వ్యతిరేక పార్టీ అన్నారు. గిరిజన మహిళ రాష్ట్రపతిగా కొనసాగడం ఆ పార్టీకి మొదటి నుంచి నచ్చడం లేదన్నారు. ఇలాంటి పార్టీ వైఖరిని దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


వెంకటరమణను సన్మానిస్తున్న రాధాకృష్ణ, కొండల్ సాయి

అఫ్జల్‌గంజ్: మార్కెట్‌లో రైతులు, వ్యాపారులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయనున్నట్లు తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ చైర్మన్ చేగురి వెంకటరమణ పేర్కొన్నారు. చైర్మన్‌గా ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణను భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ, కొండల్ సాయికృప, బాలాజీ క్యాతం, ఈశ్వర్య, క్యాతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ..అగ్రి వ్యాపార రంగం అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సాధించడమే తన ముఖ్య లక్ష్యం అన్నారు. సెక్రటరీ బట్కిరి రాజు, కోశాధికారి కె.వాసు, గౌరవ సలహాదారులు కట్ట మల్లేశం, దేవర రాజేశ్వర్, డి.రఘు, రాచూరి మల్లేశం, ఉపాధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్‌లు వంజరి వినోద్, కృష్ణ, డి.జగదీష్, స్వామి, కొండల్ సాయికృప, బాలాజీ క్యాతం ఈశ్వరయ్య, క్యాతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'లక్ష డప్పులు..వెయ్యి గొంతులు' ను జయప్రదం చేయాలి



చార్మినార్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 7న లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ చార్మినార్ నియోజవర్గం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం గుల్జార్‌హౌస్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, వాల్ పోస్టర్లు ఆవిష్కరించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చిన్నపాక యాదగిరి మాదిగ, నరసింహ స్వామి మాదిగ, ముక్కపల్లి సదానంద్, శ్రీకృష్ణ మాదిగ, లింగాల వినోద్ కుమార్ మాదిగ, కొర్ని గణేష్ మాదిగ, బండారి లక్ష్మణ్ మాదిగ, సాయి మాదిగ, కిరణ్ మాదిగ, సుధాకర్ మాదిగ, దినేష్ మాదిగ, సూరి మాదిగ, బాబురావు మాదిగ, చింటు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌బాగ్‌లో భారీ అగ్ని ప్రమాదం



బహదూర్‌పురా: కిషన్‌బాగ్‌లోని నాలుగంతస్తుల అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అందరూ గాఢనిద్రలో ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటన బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ చౌరస్తాలోని ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన జావిద్ అహ్మద్‌కు నాలుగంతస్తుల భవనం ఉంది. జావిద్, అతని సోదరుడు, తల్లిదండ్రులు ఒక్కో అంతస్తులో నివాసముంటున్నారు. సెల్లార్‌లో యూసుఫైన్ హోల్‌సేల్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. కిరాణా షాపునకు సంబంధించిన సామాన్లు సెల్లార్‌లో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచారు. శనివారం అర్ధరాత్రి సెల్లార్‌లో మంటలు రేగాయి. పొగలు వ్యాపించడంతో గమనించిన కుటుంబసభ్యులు అప్రమత్తమయ్యారు. స్థానికులు కూడా స్పందించి పై అంతస్తుల్లో ఉన్న అందరినీ కిందికి దింపారు. ఘటనా స్థలానికి చేరుకున్న బహదూర్‌పురా పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఐదు ఫైరింజన్లు వచ్చి ఆరు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, కార్పొరేటర్ హుసేనిపాషా, స్థానిక మజ్లిస్ నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వరంగల్ చౌరస్తా, పీడీపీ చౌరస్తా, అత్తాపూర్ ప్రాంతాల్లో చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో పది మంది మైనర్లు వాహనాలు నడిపించడాన్ని గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో పాటు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా నడుపుతున్న 20 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వద్దని సూచించారు. వాహనాలను ఇచ్చిన వారితో పాటు మైనర్లపై కేసులు నమోదు అవుతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. లైసెన్స్ లేని వారు లైసెన్స్‌లను పొందాలని... లేకుంటే కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



బంజారాహిల్స్: పంజగుట్ట దుర్గానగర్ కాలనీలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పూజల్లో భాగంగా ఆదివారం స్వామివారికి అష్టోత్తర శత కలశాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. శ్రీవారి ద్వాత్రింశత్ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నిత్యం హోమం, ఉత్సవ ప్రధాన హోమం, ఆలయ నవసంధి బలిహరణ, ఆస్థానం, స్వర్ణ పుష్పార్చన, నీరాజన తీర్థగోష్ఠి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం పర్యాటకులతో సరికొత్త శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలోని నగీనా బాగ్, ఆయుధాగారం, రాణీమహల్, కోటలోని వివిధ ప్రాంతాల్లో భద్రపరచబడిన ఫిరంగులను ఎంతో ఆసక్తిగా తిలకించారు. మరో వైపు విదేశీ పర్యాటకులు సైతం గోల్కొండ కోటలో కలియతిరుగుతూ ఫొటోలు తీస్తూ కనిపించారు. ఇదిలా ఉండగా నగీనాబాగ్ గార్డెన్స్ చిన్నారుల ఆటపాటలకు వేదిక కాగా యువ జంటలకు క్లాపింగ్ పోర్టికోలోని ఫిరంగులు, రామదాసు చరసాల తదితర ప్రాంతాలు సెల్ఫీలు తీసుకుంటూ సందడిగా గడిపారు.

అధికారులూ.. స్పందించరూ..!


జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్‌ల కాలనీలో చెత్తాచెదారం


జీహెచ్‌ఎంసీ జిమ్ పరిసరాల్లో ముళ్ల పొదలు

జియాగూడ: జియాగూడ 2బీ హెచ్‌కే డిగ్నిటీ కాలనీ సమస్యలతో సతమతమవుతోంది. పాత ఎంసీహెచ్ క్వార్టర్స్‌ను కూల్చివేసి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లలో సౌకర్యాలు కరువయ్యాయి. చెత్తను సకాలంలో తరలించడం లేదు. అలాగే బిల్డింగ్‌లలోని పలుచోట్ల పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగాయి. గతంలో సకాలంలో స్వీపింగ్, గార్డెనింగ్ జరిగేది కానీ జీతాలు రాకపోవడంతో వారు పట్టించుకోవడం లేదు. ఇక క్వార్టర్స్‌కు చెందిన స్థలంలో కూరగాయలు మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రహరీని నిర్మించారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్రారంభం కాకపోగా కట్టిన గోడలు శిథిలావస్థకు చేరి కూలుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.